# పేదలకు అండగా 'సీఎం సహాయనిధి'



సీఎం సహాయనిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల

- ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, మే 7 : పేదలకు అండగా సీఎం సహాయనిధి సహాయపడుతుందని ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కేటీదొడ్డి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 19మంది బాధితులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పేదల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం సీఎం సహాయనిధి పథకంతో ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఎవరైనా అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకోలేని వారు, దవాఖానలో చికిత్స పొందిన వారు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం ఆర్థికసాయం అందజేస్తుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతు, నాయకులు విజయ్‌కుమార్, కుర్మన్న తదితరులు పాల్గొన్నారు.

### సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ప్రతి విద్యార్థి సమ్మర్ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హైదరాబాద్ లెర్న్ ఓరామ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్వం సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విజ్ఞానంతోపాటు వినోదాన్ని పొందుతూ పాఠ్య, పాఠ్యేతర అంశాలను నేర్చుకునే అవకాశం సమ్మర్ క్యాంపుల ద్వారా లభిస్తుందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

# పరిశుభ్రత లోపిస్తే చర్యలు



హోటల్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

పెబ్బేరు, మే 7 : హోటళ్లు, తినుబండారాల దుకాణాల్లో పరిశుభ్రత లోపిస్తే చర్యలు తీసుకుంటామని పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి హెచ్చరించారు. బుధవారం ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ యోగేశ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆహార నాణ్యత లేకుండా, పరిశుభ్రత పాటించని, నిషేధిత ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు.

హోటళ్లలో కూరలు, చట్నీలను ఏ రోజుకారోజు తయారు చేసుకోవాలని సూచించారు. ఫ్రిడ్జ్‌ల్లో నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు వాడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ప్రతి రైస్‌మిల్లులో దొడ్డు వడ్లు దించుకోవాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి టౌన్, మే 7 : ప్రతి రైస్‌మిల్లు 5వేల బస్తాల దొడ్డు వడ్లను ఖచ్చితంగా దించుకోవాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మిల్లర్లను ఆదేశించారు. మండలంలోని చిట్యాల గోదాం, చిమనగుంటపల్లిలోని స్వామి రైస్‌మిల్, నాగరవంలోని పవనపుత్ర రైస్ మిల్లులను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మిల్లులకు దొడ్డు వడ్లు వస్తే దింపుకోవాలని అవి పక్కన పెట్టుకోవడానికి వీలులేదని ఖచ్చితంగా ప్రతి మిల్లు 5వేల బస్తాల దొడ్డు వడ్లను దించుకోవాలని ఆదేశించారు.

అదేవిధంగా వచ్చిన లారీలను త్వరగా ఆన్‌లోడ్ చేసే విధంగా హామాలీల సంఖ్యను పెంచాలన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా ప్రతి కొనుగోలు కేంద్రానికి ఒక లారీ పెట్టాలని ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లను ఆదేశించారు.

# మహనీయులకు ఘన నివాళి



మహనీయులకు నివాళులర్పిస్తున్న మహనీయుల స్ఫూర్తి వేదిక నాయకులు

వనపర్తి టౌన్, మే 7: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో కాలజ్ఞాని వీర బ్రహ్మం, అగ్గిపిడుగు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని మహనీయుల స్ఫూర్తివేదిక ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజారాం ప్రకాశ్ మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి దివ్య ఆత్మ జ్ఞాన స్వరూపుడని అన్నారు. మహా ప్రభోదకుడు బ్రహ్మంగారు అని అన్నారు. అదేవిధంగా స్వాతంత్ర్య ఉద్యమం కోసం పోరాడిన మహనీయుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. నిరక్షరాస్యులైన నిరుపేదల కోసం పోరాటం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో కవి పండితుడు గిరిరాజాచారి, దేవన్ననాయుడు, గంధం నాగరాజు, శ్రీనివాసులు, ఉత్తరయ్య, కంచె రవి, వెంకటేశ్, బండారు శ్రీనివాసులు, వెంకటస్వామి, కురుమూర్తి రంగన్న, రమేశ్, రంగస్వామి, నర్సింహ తదితరులు ఉన్నారు.

# వడదెబ్బకు జాగ్రత్తలు పాటించాలి



వీపనగండ్లలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

వీపనగండ్ల, మే7 : వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలంగాణ సాంస్కృతిక సారధి ఆధ్వర్యంలో బుధవారం మండలకేంద్రంలో ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రాజీవ్ యువ వికాస్, ఆరు గ్యారెంటీల ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరు, డ్రగ్స్ సైబర్ నేరాలపై ప్రజలకు ఆటపాటలతో అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో రాజు, నర్సింహ, కృష్ణయ్య, శ్రీనివాసులు, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి



పొల్కెపహాడ్‌లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

గోపాల్‌పేట, మే 7 : భూ భారతి రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మండలంలో కొనసాగుతున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ పరిశీలించి ఎప్పటికప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. బుధవారం మండలంలోని పొల్కెపహాడ్, చాకల్‌పల్లిలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. పొల్కెపహాడ్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సును కలెక్టర్ పరిశీలించారు. ప్రజలు తమ సమస్యలు తీసుకొని రెవెన్యూ సదస్సుకు వచ్చిన వారికి నిర్ణీత ప్రొఫార్మలో పూరించి ఇచ్చే విధంగా ఇద్దరు రెవెన్యూ సిబ్బందిని కూర్చో బెట్టారు. దరఖాస్తులోని సమస్యలు అర్థం చేసుకొని పరిష్కరించే విధంగా గ్రామానికి చెందిన రెవెన్యూ రికార్డులు పాత ఆర్‌వోఆర్ రిజిస్టర్లతో పాటు ప్రస్తుతం ఆన్‌లైన్‌లో ఉన్న భూ రికార్డులను రెవెన్యూ అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. సమస్య ఉన్న ప్రతి రైతు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. భూ సమస్య ఉన్న ప్రతి ఒక్కరూ రెవెన్యూశాఖను సద్వినియోగం చేసుకునే విధంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. పొల్కెపహాడ్‌లో 44, చాకల్‌పల్లిలో 29 మొత్తం 73 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తాసీల్దార్ రాజు, డీటీ తిలక్‌కుమార్‌రెడ్డి రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వనపర్తి టౌన్, మే 7 : రానున్న వానకాలాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంపై సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ప్రజలు దోమల వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికెన్‌గున్యా, డయేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సూచించారు. దోమల నివారణకు వారంలో రెండు రోజులు డ్రై డే పాటించడం, ఫాగ్ మిషన్లు సిద్ధం చేసుకోవడం , జ్వరం సర్వే, అవసరమైన మందులను సిద్ధంగా ఉంచుకోవడం వంటివి ముందస్తుగా ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన మిషన్ మధుమేహంపై సమీక్షిస్తూ జిల్లాలో గుర్తించిన 19,643మంది డయాబెటిస్ రోగులకు ప్రతి మూడునెలలకు ఒకసారి హెచ్‌బీఏ1సీ రక్త పరీక్షలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా పరీక్షలు రోగుల వివరాలను గూగుల్ షీట్‌లో నమోదు చేయాల్సిందిగా ప్రోగ్రాం ఆఫీసర్ రామచంద్రరావును ఆదేశించారు. అదేవిధంగా మహిళల్లో వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలను ముందుగానే గుర్తించే విధంగా ఏఎన్ఎం, స్టాఫ్ నర్సులకు శిక్షణ వచ్చి జిల్లాలో 30 ఏండ్లు వయస్సు పైబడిన మహిళలకు పరీక్షించేలా కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించే వైద్య పరీక్షలు వాటి పూర్తి వివరాలు గూగుల్ షీట్‌లో పొందుపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఏఎన్‌సీ నమోదు ప్రసవాలపై సమీక్ష నిర్వహించారు. గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు కేవలం పీహెచ్‌సీల్లో 715సాధారణ ప్రసవాలు జరగడటంపై వైద్య సిబ్బందిని అభినందించారు. గ్రామాల్లో గర్భిణులకు సమయానికి ఏఎన్‌సీ నమోదు నిర్వహించడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవాలు చేసే విధంగా గర్భిణులు వారి కుటుంబ సభ్యులకు విశ్వాసాన్ని నెలకొల్పాలని సూచించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్‌రెడ్డి, డాక్టర్ రామచంద్రరావు, డాక్టర్ పరిమళ, డాక్టర్ మంజుల పాల్గొన్నారు.

### నిబంధనలకు అనుగుణంగా కొనుగోళ్లు జరగాలి

వరిధాన్యం సరసమైన సగటు నాణ్యత (ఎఫ్ఏక్యూ) నిబంధనలకు అనుగుణంగా కొనుగోలు జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత వ్యవసాయ అధికారులపై ఉందని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలతో కలెక్టర్ వీసీ నిర్వహించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల కొనుగోలు కేంద్రాలను పరిశీలించినప్పుడు చాలా చోట్ల వరిలో తాలు, మట్టి, గడ్డి ఎక్కువగా కన్పిస్తుందన్నారు. నాణ్యమైన వడ్లు ఇవ్వకుంటే మిల్లర్లు తీసుకోవడానికి ఇష్టపడరన్నారు. మండల వ్యవసాయ అధికారులు, ఏఈవోలు ఖచ్చితంగా కొనుగోలు కేంద్రాలను పరిశీలించి వడ్లలో గడ్డి, తాలు, మట్టి లేకుండా సరైన తేమతో కూడిన వడ్లు కొనుగోలు చేసే విధంగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు సూచించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు తప్పులు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎఫ్ఏక్యూ ప్రమాణాలతో ఇచ్చిన వడ్లను మిల్లర్లు సకాలంలో దించుకోకున్నా, లేక తరుగు పేరుతో కోతలు విధించిన మిల్లులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సరసమైన సగటు నాణ్యత నిబంధనల ప్రకారం నాణ్యమైన వడ్లు మిల్లులకు ఇవ్వాల్సిన బాధ్యత రైతులు, వ్యవసాయ అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయి అధికారి విశ్వనాథ్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారి రాణి, వ్యవసాయ మండల, క్లస్టర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఈవీఎం గోదాం పరిరక్షణ జాగ్రత్తగా నిర్వహించాలి

ఈవీఎం గోదాం పరిరక్షణ జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు ఆదేశించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయ సముదాయంలో ఉన్న ఈవీఎం గోదాం భద్రతను పరిశీలించారు. నిరంతర నిఘా కోసం ఎంత మంది పోలీసులు విధులు నిర్వర్తిస్తున్నారనే వివరాలు అడిగి రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ కిషన్‌నాయక్, ఇతర సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

### వేసవి శిబిరాల తనిఖీ

జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న వేసవి శిబిరాలను బుధవారం కలెక్టర్ ఆదర్శ్ సురభి తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని బాలకిష్టయ్య క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న వేసవి శిబిరంలో హాకీ, కిక్ బాక్సింగ్, ఫుట్‌బాల్, చెస్ క్రీడలను పరిశీలించి క్రీడాకారులతో మాట్లాడారు. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. వేసవి శిబిరాల వల్ల విద్యార్థులు, క్రీడాకారులు నైపుణ్యాలను అభివృద్ధిని చేసుకోవాలని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లాలోని వనపర్తి, ఆత్మకూరు, పెబ్బేరు ఇతర మండలాల్లో నిర్వహించే శిక్షణ శిబిరాల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు యువజన క్రీడల అధికారి సుధీర్‌రెడ్డి 9440489057, 9885851813 నెంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం ప్రాంగణంలో ఉన్న క్రీడా సామగ్రిని, జిమ్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సుధీర్‌రెడ్డి, తాసీల్దార్ రమేశ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

# రైతులు నాణ్యమైన విత్తనాలను వాడాలి

- డీఏవో గోవిందనాయక్



పామిరెడ్డిపల్లిలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి హాజరైన శాస్త్రవేత్తలు, అధికారులు

పెద్దమందడి, మే 7 : ఆరుగాలం పండించిన పంటలు అధిక దిగుబడి రావాలంటే రైతులు నాణ్యమైన విత్తనాలను వాడాలని డీఏవో గోవిందనాయక్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ శాస్త్రవేత్త సుధాకర్ అన్నారు. బుధవారం మంలంలోని పామిరెడ్డిపల్లి గ్రామంలో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలను సాగులో వాడాలని, వీలైనంత వరి విస్తీర్ణాన్ని తగ్గించి ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. పంటలకు తగు మోతాదులో యూరియాను వాడాలని, క్రిమిసంహారక మందులను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వాడాలని విత్తనశుద్ధి ప్రాముఖ్యను వివరించారు. అదేవిధంగా శాస్త్రవేత్త శశిభూషణ్ మాట్లాడుతూ వరిలో అధిక దిగుబడిని ఇచ్చే కొత్త వంగడాలను, వాటి లక్షణాలను వివరించారు. అలాగే కీటక శాస్త్రవేత్త డాక్టర్ మాధురి మా ట్లాడుతూ వరి సాగులో వచ్చే కీటకాలు, పురుగులు, వాటి ద్వారా వచ్చే రోగాలు వాటి నివారణ చర్యలు వివరించారు. క్రిమిసంహారక మందులు కొనుగోలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, వాటికి తప్పకుండా రసీదులు తీసుకోవాలన్నారు. క్రమం తప్పకుండా భూసార పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో సైదులుయాదవ్, ఏఈవో మధు, అర్చ, కృష్ణయ్య, రైతులు నరేశ్, వెంకటయ్య, వెంకటస్వామి, రాధాకృష్ణ, సిద్ధయ్య, భాగ్యమ్మ, ఇంద్రమ్మ, లక్ష్మారెడ్డి, రైతులు, అధికారులు ఉన్నారు.

### నేటి నుంచి 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు '

గద్వాల రూరల్, మే 7 : ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు నేటి నుంచి జూన్ 13వరకు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జిల్లాలో నిర్వహిస్తున్నట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులు, అధ్యాపకులు, వ్యవసాయ విద్యార్థులు ఆయా మండలాల్లోని గ్రామాల్లోని రైతు వేదికల్లో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. ఈనెల 8వ తేదీన గద్వాల మండలం కొండపల్లి గ్రామంలో, 9న కేటీదొడ్డి మండలం కుచినెర్ల, 13న అయిజ మండలం, ఉప్పల, 12న గట్టు మండలం ఆలూరు, 16న మానవపాడు మండలం మానవపాడు, 17న మల్దకల్ మండలం విఠలాపురం, 23న ఉండవెల్లి మండలం పుల్లూరు, 31న ఇటిక్యాల మండలం పుటాన్‌దొడ్డి, జూన్ 3న ధరూర్ మండలం ఉప్పేరు, జూన్ 9న వడ్డేపల్లి మండలం కొంకలలో, 12న రాజోళి మండలం తుమ్మిళ్ల, 13న అలంపూర్ మండలం లింగనవాయి గ్రామాల్లో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి టౌన్, మే 7 : కేంద్ర ప్రభుత్వ పథకంలో భాగంగా ర్యాంప్ ప్రోగ్రాం మేనేజర్, సహాయ మేనేజర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ జ్యోతి బుధవారం ప్రకటనలో తెలిపారు. ర్యాంప్ అనేది ప్రపంచ బ్యాంక్ మద్దతుతో కూడిన కేంద్ర ప్రభుత్వ పథకమని ఈ ఒప్పంద ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేస్తున్నామని చెప్పారు. ఈనెల 10వ తేదీలోగా పూర్తి వివరాలు www.nimsme.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని చెప్పారు.

### నూతన కమిటీ ఏర్పాటు

వడ్డేపల్లి, మే 7 : వడ్డేపల్లిలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా శివన్న, ప్రధానకార్యదర్శిగా రాఘవేంద్ర, కోశాధికారిగా దయానంద్, ఉపాధ్యక్షుడిగా మహేశ్వరి, సహాయ కార్యదర్శిగా పార్వతమ్మ, కమిటీ సభ్యులుగా సుందర్‌రాజు, బీసన్నలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి సంజీవరాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

గోపాల్‌పేట, మే 7 : చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన తాడిపర్తిలో చోటు చేసుకున్నది. ట్రైనీ ఎస్సై నరేశ్ కథనం మేరకు..మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన చిన్నరాములు (61) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇది ఇలా ఉండగా బుధవారం ఉదయం తాగిన మైకంలో గ్రామ సమీపంలోని లక్ష్మీసముద్రం చెరువుకు చేపల వేటకు వెళ్లాడు. ఎంతకీ ఇంటి రాకపోయే సరికి కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి చూడగా, చేపల వల చుట్టుకొని మృతిచెంది ఉన్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు శవాన్ని నీళ్లలో నుంచి బయటకు తీయించి పంచనామా చేశారు. మృతుడి కొడుకు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని వనపర్తి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

### ఆపరేషన్ సిందూర్ భారతీయుల విజయం

వనపర్తి టౌన్, మే 7: ఆపరేషన్ సిందూర్ భారత ప్రజల విజయమని సాహితీవేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్ బుధవారం ప్రకటనలో అన్నారు. అమాయకులను కాల్చిచంపిన ఉగ్ర మూకలపై భారత సైన్యం చేపట్టిన చర్యలు అద్భుతమని అన్నారు. పార్టీలకు, ప్రాంతాలకు , మతాలకు, కులాలకు అతీతంగా దేశం మొత్తం భారత ప్రభుత్వం వెంట ఉందన్నారు. భారతీయులందరం ఏకమై ఐక్యత చాటాల్సిన సందర్భం ఇదని ఆపరేషన్ సిందూర్‌తో ఉగ్రవాద మూకల నిర్మూలన కార్యక్రమం విజయవంతం కావడం హర్షించదగ్గ విషయమని శంకర్‌గౌడ్ అన్నారు. 11 ఉగ్రవాదుల శిబిరాలపై దాడి చేసి 100కు పైగా ఉగ్రవాదులను హతమార్చిన భారత సైనికులను జయహో అని అన్నారు.

### రెండుబైకులు ఢీ..

- ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

అయిజ రూరల్, మే 7 : బైకు ప్రమాదంలో యువకుడు మృతిచెంది మరో యువకుడికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కిష్టాపురం సమీపంలో బుధవారం చోటు చేసుకున్నది. ఎస్సై శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వడ్డేపల్లి మండలం తనగల గ్రామానికి చెందిన త్రివేన్, రవి, శివ వెంకటాపురానికి బైక్‌పై వెళ్తున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన హోంగార్డు కానిస్టేబుల్ రామానాయుడు హైదరాబాద్‌లో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన వివాహం నిమిత్తం సెలవుపై వెంకటాపురం నుంచి తనగలకు బైకుపై వెళ్తున్న క్రమంలో కిష్టాపురం సమీపంలో రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. త్రివేన్(26) అక్కడిక్కడే మృతి చెందాడు. రామానాయుడుకి తీవ్ర గాయాలయ్యాన్నారు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు రామానాయుడుని కర్నూల్ దవాఖానకు తరలించినట్లు ఎస్సై తెలిపారు. కాగా రామానాయుడికి ఈనెల 14వ తేదీన వివాహం నిశ్చయించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మల్దకల్, మే 7 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని శేషంపల్లి గ్రామ సమీపంలోని నెట్టంపాడు కాల్వ వద్ద బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామస్తుల కథనం ప్రకారం మండలంలోని అమరవాయి గ్రామంలో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు అయిజ మండలం బింగిదొడ్డి గ్రామానికి చెందిన నర్సింహులు బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి తిరుగు ప్రయాణంలో బైక్‌పై అమరవాయి నుంచి బింగిదొడ్డి గ్రామానికి వెళ్తున్న క్రమంలో అయిజ నుంచి గద్వాలకు వెళ్తున్న మ్యాక్స్ క్యాబ్ శేషంపల్లి సమీపంలో ఢీ కొట్టిందన్నారు. నర్సింహులకు గాయాలు అంబులెన్స్‌లో గద్వాల ప్రభుత్వ దవాఖానకు చికిత్సకు తరలించారు. కాగా పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.

### నేడు ఆత్మకూర్‌లో కంటి వైద్య శిబిరం

అమరచింత, మే 7: ఆత్మకూర్ ప్రభుత్వ దవాఖాన ఆవరణలో గురువారం కందూర్ రాంరెడ్డి దవాఖాన సౌజన్యంతో కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లుగా హెల్త్ సూపర్ వైజర్ సురేందర్‌గౌడ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఆత్మకూర్, అమరచింత, నర్వ మండలాలకు చెందిన వారికి కంటి సమస్యలు ఉంటే వారు ఆధార్, రేషన్‌కార్డు, లేదా ఏదైన గుర్తింపు కార్డును తీసుకొని ఈ వైద్య శిబిరానికి రావాలన్నారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన మందులను కూడా ఉచితంగా అందజేస్తారని, అవసరమైన వారికి ఆపరేషన్ కూడా ఉచితంగా చేయిస్తారన్నారు. ఆత్మకూర్, అమరచింత, నర్వ మండలాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

# సృజనాత్మకత పెంపునకే సమ్మర్ క్యాంప్




సమ్మర్ క్యాంప్‌లో పాల్గొన్న విద్యార్థులతో జీహెచ్‌ఎం, ఉపాధ్యాయులు

వనపర్తి టౌన్, మే 7 : విద్యారుల్లోని సృజనాత్మకతను పెంపొందించడానికి ప్రభుత్వ పాఠశాలల్లో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం కార్యదర్శి, జీహెచ్‌ఎం సూర చంద్రశేఖర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని దళితవాడ జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న సమ్మర్ క్యాంప్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు ఖాళీగా ఉండకుండా ఉదయం పూట స్పోకెన్ ఇంగ్లిష్, గణితశాస్త్రంలో మెళకువలు, చిత్రలేఖనం, బొమ్మల తయారీ, ఇండోర్ గేమ్స్ తదితర వాటిలో 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారని తెలిపారు. . ప్రస్తుతం శిబిరంలో 40మంది విద్యార్థులు హాజరవుతున్నారని, మరింత మంది విద్యార్థులు హాజరయ్యేల చూ స్తామని చంద్రశేఖర్ తెలిపారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించి సమ్మర్ క్యాంపులో వారు నేర్చుకున్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఈవో మద్దిలేటి, సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు రవికుమార్, మధుసూదన్‌రెడ్డి, బైరోజు చంద్రశేఖర్, విజయమ్మ పాల్గొన్నారు.

# కనిమెట్ట ఊకచెట్టు వాగు బ్రిడ్జి నిర్మాణం పూర్తి


- మాజీ ఎమ్మెల్యే ఆల చొరవతో పనులు



ఆల వెంకటేశ్వర్‌రెడ్డి చొరవతో కనిమెట్ట, పాత జంగమాయపల్లిలో పూర్తయిన ఊకచెట్టు వాగు బ్రిడ్జి (ఫైల్)

కొత్తకోట, మే 7 : మండలంలోని కనిమెట్ట నుంచి పాత జంగమాయపల్లి గ్రామాల మధ్య ఉన్న ఊక చెట్టు వాగు బ్రిడ్జి నిర్మాణం గత ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కృషితో చేపట్టారు. అయితే ఈ బ్రిడ్జిని గత శనివారం కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. దీనిపై మాజీ ఎంపీపీ గుంతమౌనిక వివరణ ఇస్తూ అధిక వర్షాలు కురిస్తే పాత జంగమాయపల్లి, కనిమెట్ట గ్రామాల మధ్యన ఉన్న ఊకచెట్టు వాగు దాటడానికి ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. ఈ రహదారి సరిగా లేకపోవడంతో ఏదైనా అత్యవసరం వస్తే పడవలు వేసుకొని వాగును దాటే పరిస్థితి వచ్చేదని తెలిపారు. గత 40ఏండ్లుగా గతంలో అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలకు, మినిస్టర్లకు అదేవిధంగా సీఎం హోదాలో ఉన్న రాజశేఖర్‌రెడ్డి, నారా చంద్రబాబు నాయుడులకు కూడా వినతిపత్రాలు ఇచ్చినా ఏ ఒక్క పార్టీ కూడా ఈ సమస్యను పట్టించుకోలేదని ఆమె విమర్శించా రు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ సమస్యను ఇరు గ్రామాల ప్రజలు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి అప్పటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపనకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తి కావడంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కృషి ఎంతో ఉందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, ఉమ్మడి జిల్లాల అధికార ప్రతినిధి గాడిల ప్రశాంత్, నెహ్రూ, ఇరు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

### గతంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నాం.



ఇరుగ్రామాల మధ్యన ఉన్న ఊకచెట్టు వాగు వల్ల గతంలో ఎన్నో సమస్యలను ఎదుర్కొన్నాం. అంతేకాకుండా ఇరు గ్రామాల మధ్యన సత్సంబంధాలు కూడా అంతత మాత్రమే ఉండేవి. ఎన్నో ఏండ్లనాటి కలను మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి చొరవ చూపడంతో ఇరు గ్రామాల మధ్యన బ్రిడ్జి రావడంతో ఎంతో సంతోషకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

-గాధం రాణిపరమేశ్, మాజీ సర్పంచ్, కనిమెట్ట